సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025



సోమశిలలో 52.18 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారానికి 52.18 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 750 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.98,230
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,858
3 శాతం జీఎస్టీతో	రూ.9,124
సవర (8 గ్రా)	రూ.72,992

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.2 /27.4

గాలిలో తేమ 70 శాతంగా గురువారం నమోదైంది. జిల్లాలో వాతావరణంలో శుక్రవారం పెద్ద మార్పేమీ ఉండదని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఎస్పీఎల్ విజేత లయన్స్ జట్టు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సింహపురి ప్రీమియర్ లీగ్ టీ – 20 క్రికెట్ చాంపియన్‌గా నెల్లూరు రూరల్ లయన్స్ జట్టు నిలిచింది. బుజబుజనెల్లూరులోని సీఏఏ క్రీడా మైదానంలో హోరాహోరీగా సాగిన ఫైనల్స్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నెల్లూరు రూరల్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన గూడూరు రాయల్ చాలెంజర్స్ జట్టు 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 196 పరుగులకే పరిమితమైంది. దీంతో నెల్లూరు రూరల్ లయన్స్ జట్టు విజేతగా నిలిచింది. జట్టులోని పూర్ణ బౌలింగ్‌లో, బ్యాటింగ్‌లో ఉత్తమ ప్రతిభ చూపి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును దక్కించుకున్నారు. విజేతలకు బహుమతులను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అందజేశారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నెల్లూరు డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ కేర్‌టేకర్ శ్రీనివాసులురెడ్డి, సంయుక్త కార్యదర్శి మునిగిరీష్, సభ్యులు శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి, నిర్వాహక కమిటీ చైర్మన్ వంశీకుమార్, నవాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రుస్తుం మైన్ రికార్డుల పరిశీలన

పొదలకూరు: మండలంలోని రుస్తుం మైన్ రికార్డులను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిస్ట్రిక్ట్ ట్రెనింగ్ సెంటర్ డీఎస్పీ గిరిధర్‌రావు గురువారం పరిశీలించారు. మైన్‌కు సంబంధించిన సర్వే నంబర్లు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్రమ మైనింగ్‌కు సంబంధించిన కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఏ – 4గా చేర్చడం, ఎస్సీ, ఎస్టీ కేసును ఇంప్లీడ్ చేయడం తదితర పరిణామాల నేపథ్యంలో రికార్డుల పరిశీలన ప్రాధాన్యత సంతరించుకుంది. కేసు దర్యాప్తులో భాగంగానే రికార్డులను పోలీస్ అధికారులు పరిశీలించారని తెలుస్తోంది. తహసీల్దార్ శివకృష్ణయ్య వద్ద స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (లీగల్): జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌ను కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. కోర్టులోని ఆయన చాంబర్‌లో కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు.

ఇద్దరు పంచాయతీ సెక్రటరీల సస్పెన్షన్

నెల్లూరు(పొగతోట): నిధుల దుర్వినియోగం తదితర అంశాల్లో అక్రమాలకు పాల్పడిన మనుబోలు మండలం వీరంపల్లి పంచాయతీ కార్యదర్శి ఆదిలక్ష్మి, బోగోలు మండలం నాగులవరం పంచాయతీ సెక్రటరీ భాస్కర్‌రావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను డీపీఓ శ్రీధర్‌రెడ్డి గురువారం జారీ చేశారు. గ్రామ పంచాయతీ పనుల నిమిత్తం వచ్చిన ప్రజల నుంచి నాగులవరం పంచాయతీ సెక్రటరీ నగదును డిమాండ్ చేయడం, వసూలు చేసిన ఇంటి పన్ను రూ.23593ను జమ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గానూ సస్పెన్షన్ వేటేశారు. వీరంపల్లి సెక్రటరీ పంచాయతీకి సంబంధించిన సాధారణ నిధులు రూ.1,04,650, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.ఐదు వేలను దుర్వినియోగం చేశారు. సాధారణ నిధుల నుంచి రూ.21,290, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.32990ను నిబంధనలు పాటించకుండా డ్రా చేయడంతో సస్పెండ్ చేశారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280


మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో కిలో పొగాకుకు గరిష్టంగా రూ.280 ధర గురువారం పలికిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 760 బేళ్లు రాగా, 521 బేళ్లను కొనుగోలు చేశామని చెప్పారు. కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.220, సగటున రూ.256.41 ధర పలికిందని వివరించారు. వేలంలో 11 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

పెన్నా కడుపు కోత

చెలరేగిపోతున్న ఇసుకాసురులు

- ఇష్టానుసారంగా తవ్వకాలు
- డ్రెడ్జింగ్ పేరుతో యంత్రాలు
- అనుమతుల్లేకపోయినా యథేచ్ఛగా..
- బ్యారేజీకి సమీపంలోనూ దందా
- చోద్యం చూస్తున్న అధికారులు

ఇసుకాసురుల ధనదాహానికి పెన్నమ్మ విలవిల్లాడుతోంది. ఇచ్చిన అనుమతుల గడువు పూర్తయినా ఒకరు తవ్వకాలు సాగిస్తుండగా, సంగం బ్యారేజీకి అతి సమీపంలో ఇబ్బడిముబ్బడిగా మరొకరు తోడేస్తున్నారు. దీనిపై రైతులు ప్రశ్నిస్తే, భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వ పెద్దలు అక్రమ కేసులు బనాయిస్తారనే భయంతో వీరు మిన్నకుండిపోతున్నారు. డ్రెడ్జింగ్ పేరుతో యంత్రాలను వినియోగించి ఇష్టానుసారంగా కొల్లగొడుతున్నా, చోద్యం చూడటం అధికారుల వంతవుతోంది.



టిప్పర్‌లో ఇసుకను లోడ్ చేస్తున్న యంత్రం



భారీ లారీలో ఇసుక తరలింపు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పెన్నా.. కడుపు కోతతో అల్లాడుతోంది. నది లోపలికి రోడ్డును నిర్మించి మరీ ఇసుకను తోడేస్తున్నారు. డ్రెడ్జింగ్‌కు కాంట్రాక్టర్లకు అనుమతిస్తే, యంత్రాలను వినియోగించి కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు మండలం సూరాయపాళెం రీచ్‌లో నిబంధనలను పాటించే నాథుడే కరువయ్యారు.

ఇతర రాష్ట్రాలకు రవాణా

నాకింత, నీకింత అనే రీతిలో ఇసుకను తోడేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. మైనింగ్, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం.. పర్యావరణ ముప్పు ఏర్పడటంతో పాటు బ్యారేజీ మనుగడ ప్రశ్నార్థకంగా మారనుందని చుట్టుపక్కల గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొల్లగొడుతూ..

పొదలకూరు మండలం సూరాయపాళెం పరిధిలోని పెన్నాలో డ్రెడ్జింగ్ ద్వారా ఇసుకను తోడుతున్నారు. వాస్తవానికి ఇక్కడి రెండు రీచ్‌లకు డ్రెడ్జింగ్ అనుమతులు జారీ చేశారు. దీని పేరుతో ఇష్టానుసారం కొల్లగొడుతూ పెద్ద లారీలు, టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నది లోపలికి వెళ్లి డ్రెడ్జింగ్‌తో పాటు యంత్రాలను పెడుతున్నారు. ఒక రీచ్‌కు ఇచ్చిన అనుమతి గత నెల్లోనే ముగిసినా, తవ్వకాలు ఏ మాత్రం ఆగడంలేదు. మే నెలాఖరు వరకు పొడిగించారని అధికారులు చెప్తున్నారు. అనుమతులు పూర్తయిన సమయంలోనూ రాత్రివేళ నదీ గర్భంలోకి వెళ్లి మరీ తోడేశారు.

నిబంధనలు బేఖాతర్

సంగం ఆనకట్టకు దగ్గర్లోనే ఇసుకను తోడేయడంతో బ్యారేజీకి ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నిబంధనల మేరకు బ్యారేజీకి 500 మీటర్ల దూరంలో ఇసుక తవ్వకాలు లేదా డ్రెడ్జింగ్ చేయాల్సి ఉంటుంది. అయితే 250 మీటర్లలోపే ప్రక్రియను యథేచ్ఛగా జరుపుతున్నారు. మరోవైపు నది ఒడ్డున ర్యాంప్‌ను ఏర్పాటు చేసి, పడవల ద్వారా ఇసుకను తీసుకొచ్చి బయట నిల్వ చేసుకోవాలి. అయితే ఇక్కడ ఇలాంటివేవీ కానరావడంలేదు.

పర్యావరణానికి ముప్పు

ఇసుక అక్రమ తవ్వకాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. ఇష్టానుసారంగా.. లోతుగా తోడేయడంతో చుట్టుపక్కల భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం పొంచి ఉంది.



పెన్నా లోపలికి నిర్మించిన గ్రావెల్ రోడ్డు

నదిలోకి రోడ్డు

నదిలోకి అర కిలోమీటర్ మేర గ్రావెల్ రోడ్డును నిర్మించి భారీ యంత్రాలను దింపి ఇసుకను తవ్వుతున్నారు. రీచ్‌ల నుంచి నిత్యం సుమారు 600 టన్నులను తరలిస్తున్నారు. అయితే గత నెల వరకు ఐదు వేల టన్నులనే ఇక్కడి నుంచి తరలించారంటూ అధికారులు లెక్కలు చూపుతున్నారు. టన్నుకు రూ.250 వసూలు చేస్తూ, ప్రభుత్వానికి సీనరేజ్ ద్వారా రూ.78నే చెల్లిస్తున్నారు.

అనుమతులను పొడిగించాం

డ్రెడ్జింగ్ కాంట్రాక్ట్ పొందిన రీచ్ – 1 కాంట్రాక్టర్‌కు అనుమతులను మే వరకు పొడిగించాం. అక్రమ తవ్వకాలు జరిపితే ఉపేక్షించేది లేదు. ఆధారాలను సమర్పిస్తే చర్యలు చేపడతాం.
– రవికుమార్‌రెడ్డి, ఇరిగేషన్ ఇన్‌చార్జి డీఈ, పొదలకూరు

ఇప్పటికే పక్క గ్రామం విరువూరులో ఈ పరిస్థితి ఏర్పడింది. చెంతనే పెన్నా ఉన్నా బోర్లు వేస్తే సక్రమంగా నీరు పడటంలేదు. దీనికి తోడు రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన సంగం బ్యారేజీ మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. అతి సమీపంలో ఇసుక తవ్వకాలతో భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే ప్రమాదమూ లేకపోలేదు. కాగా పర్యావరణ ముప్పుపై ఇసుక కాంట్రాక్టర్లతో సూరాయపాళేనికి చెందిన కొందరు రైతులు ఇటీవల మాట్లాడారు. బ్యారేజీకి దూరంగా తవ్వకాలు చేసుకోవాలని, ఇలానే వ్యవహరిస్తే లారీలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

మూడు లక్షల ఎకరాలకు సాగునీరు

- రెండో పంటకు మే ఐదున విడుదల
- 41 టీఎంసీల కేటాయింపు
- ఐఏబీ సమావేశంలో మంత్రి రామనారాయణరెడ్డి



మాట్లాడుతున్న రామనారాయణరెడ్డి

నెల్లూరు (పొగతోట): సోమశిల జలాశయంలో 56.268 టీఎంసీల నీటి లభ్యత ఉందని, రెండో పంటలో మూడు లక్షల ఎకరాలకు 41 టీఎంసీలను మే ఐదు నుంచి విడుదల చేసేలా సాగునీటి సలహా మండలిలో తీర్మానం చేశామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఐఏబీ సమావేశాన్ని కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. డెడ్ స్టోరేజ్, నీటి ఆవిరి, మంచి నీటి అవసరాల కోసం 12.5 టీఎంసీలు అవసరమని, ఇవి పోనూ 43 టీఎంసీలు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

తక్కువ నీటితో సాగుకు సన్నద్ధం కండి

రాబోయే అవసరాలను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటిని సాగుకు వినియోగించేలా రైతులను సన్నద్ధం చేయాలని సూచించారు. ఆరుతడి పంటలు, తక్కువ సమయంలో పండే పంటలపై అవగాహన కల్పించాలని కోరారు. విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచేలా వ్యవసాయాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. లష్కర్లకు రూ.4.68 కోట్ల వేతన బకాయిలున్నాయని, ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. గత సీజన్‌కు సంబంధించి 1.09 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, రూ.190 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని ప్రకటించారు.

పంట నష్టంపై అంచనాలు

వర్షాలు, గాలులకు పంట నష్టం సంభవించిందని, దీనిపై అంచనాలను రూపొందించి నివేదికలను అందజేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరాలను దృష్టిలో ఉంచుకొని తిరుపతికి ఎప్పుడైనా నీటిని విడుదల చేయాల్సి ఉంటుందన్నారు. తాగునీటి అవసరాల నిమిత్తం చెన్నైకు 15 టీఎంసీలను విడుదల చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. జిల్లాలో తాగునీటి అవసరాలను గుర్తించి నీటి నిల్వలను పెంచాలని సూచించారు.

ప్రతిపాదనలు ఇలా..

పెన్నార్ డెల్టా ఆయకట్టు రెండు లక్షల ఎకరాలు.. కనుపూరు కాలువ 25 వేలు.. సోమశిల ప్రాజెక్టు కాలువ కింద 1.44 లక్షల ఎకరాలు.. మొత్తం 3.69 లక్షల ఎకరాలకు 43.42 టీఎంసీల నీటి కేటాయింపునకు అధికారులు ప్రతిపాదించారని వెల్లడించారు. ఎమ్మెల్యేలు, సాగునీటి సంఘాల అధ్యక్షులు తదితరుల ఆమోదం మేరకు రెండో పంటలో సుమారు మూడు లక్షలకుపైగా ఎకరాలకు 41 టీఎంసీలను కేటాయించామని తెలిపారు.

కాలువల పనులకు రూ.18 కోట్లు

జిల్లాలో మేజర్, మైనర్ ఇరిగేషన్ కాలువ పనుల కోసం రూ.18 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. జిల్లాలో రూ.38 కోట్ల నీటి పన్ను బకాయిలున్నాయని, వీటిని వసూలు చేస్తే ఆయా నియోజకవర్గాల్లో కాలువల మరమ్మతులకు వినియోగించొచ్చని తెలిపారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఇరిగేషన్ అధికారులు జాగ్రత్తగా పనిచేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ నిధులతో మైనర్ ఇరిగేషన్ కాలువల పనులను చేపట్టాలని సూచించారు.

గోశాలలో సహజ మరణాలు

తిరుమల గోశాలలో గోవుల మరణాలు సహజమైనవేనని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని జెడ్పీ కార్యాలయంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశాలు..

- సర్వేపల్లి నియోజకవర్గంలో రెండో పంటకు రైతులు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా లేరని, సర్వేపల్లి కాలువకు కేటాయించిన నీటిని తగ్గించేలా.. అవసరమైన ప్రాంతాల్లో పంటల సాగుకు వినియోగించేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు.
- కనిగిరి రిజర్వాయర్, జాఫర్ సాహెబ్ కాలువ పూడికతీత పనులను చేపట్టి చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు.
- దగదర్తి మండలానికి సంబంధించిన డీఆర్ ఛానల్ పనులను త్వరగా పూర్తి చేయడంతో పాటు సాగునీటిని విడుదల చేసే ముందే కాలువ పనులను జరపాలని కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు.
- గండిపాళెం ప్రాజెక్ట్‌పై ప్రత్యేక శ్రద్ధతో పాటు సోమశిల జలాలను ఉదయగిరి నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో వినియోగించేలా చూడాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కోరారు. కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, ఆత్మకూరు ఆర్డీఓ పావని, ఇరిగేషన్ అధికారులు దేశ్‌నాయక్, వెంకటరమణారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, ఉద్యానాధికారి సుబ్బారెడ్డి, ఏపీఎమ్మెడీపీ పీడీ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతులు

ఇంటూరి.. ఏంటిది..?

- అన్యాయంగా దేవదాయ భూముల వేలం
- కూటమి నేతలకు కట్టబెట్టిన వైనం
- దగ్గరుండి మరీ ఎమ్మెల్యే అరాచకం
- పోలీసులు, అధికారుల సహకారంతో బరితెగింపు
- బహిష్కరించిన అధిక శాతం రైతులు

ఉలవపాడు: ఇసుక.. గ్రావెల్.. ప్రకృతి వనరులను కొల్లగొట్టి తమ అస్మదీయులకు కట్టబెట్టడంలో నిమగ్నమైన టీడీపీ ప్రజాప్రతినిధుల కళ్లు తాజాగా దేవదాయ భూములపై పడ్డాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా సదరు భూముల కౌలు వేలాన్ని తమ ఇష్టానుసారంగా నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేశారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో గురువారం జరిగిన ఈ ఉదంతానికి ఉలవపాడులోని వేణుగోపాలస్వామి దేవస్థాన ఆవరణ వేదికైంది.

నిబంధనలు తుంగలో..

నిబంధనలను తుంగలో తొక్కి వేలాన్ని ఎమ్మెల్యే జరిపించారు. వాస్తవానికి ఉలవపాడులోని వేణుగోపాలస్వామి దేవస్థానానికి సంబంధించి కందుకూరు మండలం గోపాలపురంలో 172.48 ఎకరాల భూమిని కౌలుకిచ్చేందుకు బహిరంగ వేలాన్ని నిర్వహించారు. గతంలో ఈ భూమిని సాగు చేసుకుంటున్న రైతులు, నూతనంగా చేసుకోవాలనుకునే వారు దరావతును చెల్లించారు. అయితే కూటమి ప్రభుత్వం తాము అనుకున్న విధంగా తమకు నచ్చినవారికే వేలం వచ్చేలా చూడాలని నిర్ణయించుకున్నారు. దీనికి గానూ పోలీసులను భారీగా మోహరించారు. వీటిని దక్కించుకోవాలనే లక్ష్యంతో అరాచకంగా వ్యవహరించారు.

అంతా ఏకపక్షం..

వేలాన్ని ఎమ్మెల్యే దగ్గరుండి మరీ అరాచకంగా నిర్వహించారు. వేలం ప్రారంభమవ్వగానే తొలుత ఎవరైనా పాట పాడితే నగదు విలువ చెప్పారు. ఇలా ప్రారంభమైన వెంటనే తమకు నచ్చిన వారు రావడం, వెంటనే మూడు సెకన్లలో మూడు సార్లు పలకడం, ఆపై పేరును ఖరారు చేశారు. దీనిపై ప్రశ్నిస్తే, వెంటనే వచ్చి కూర్చోండి ఆ బిట్ అయిపోయింది, తర్వాత వేలం జరుగుతుందని పోలీసులు చెప్పారు. మొత్తం 48 పొలం బిట్లకు వేలం జరగ్గా, తొలుత నాలుగు బిట్లకు నిర్వహించిన తీరుతోనే ప్రక్రియ మొత్తం అర్థమైపోయింది. ఎమ్మెల్యే చెప్పిన పేర్లను ప్రకటించడం తప్ప వేలం సక్రమంగా జరగలేదని నిర్ధారించుకున్నారు. రూ.ఐదు వేల దరావతు చెల్లించి వేలానికి హాజరైన ఎక్కువ మంది రైతులు బయటకొచ్చేశారు. ఆపై అధికారులు, కూటమి నేతలు ఎమ్మెల్యే సమక్షంలో కూర్చొని నచ్చిన పేర్లకు కౌలు వచ్చేలా చూశారు.

పాత్రికేయులకు బెదిరింపులు

ఎమ్మెల్యే ఇలా వ్యవహరించడం బాధాకరమని పలువురు రైతులు వాపోయారు. అప్రజాస్వామికంగా జరగడంతో తాము బయటకొచ్చేశామని చెప్పారు. లోపలికెళ్లిన పాత్రికేయులను సైతం ఎందుకొచ్చారు.. బయటకెళ్లిపోండి.. ఫొటోలు, వీడియోలు తీయొద్దు.. తర్వాత ఈఓ చెప్తారంటూ కందుకూరు రూరల్ ఎస్సై మహేంద్ర బెదిరించి బయటకు పంపారు. ఓ పత్రిక విలేకరిని దగ్గరుండి బయటకు సాగనంపారు. గతేడాది 172.48 ఎకరాల భూమికి రూ.7.78 లక్షల కౌలు రాగా, ప్రస్తుతం రూ.18 లక్షలు లభించింది. 128 మంది రైతులు వేలానికి హాజరయ్యారు. ఈఓలు నరసింహదాసు, రవీంద్రనాథ్, సునీల్, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



భారీగా మోహరించిన పోలీసులు

కావలిలో చెలరేగిన దొంగలు

- నాలుగిళ్లలో చోరీ
- కారులో వచ్చి దొంగతనం చేసి.. పరార్
- ప్రొద్దుటూరు ముఠాగా గుర్తించిన పోలీసులు

కావలి: కావలిలో దొంగలు చెలరేగిపోయారు. గురువారం ఉదయం పది నుంచి 12 గంటల్లోపు నాలుగిళ్లలో తాళాలను తొలగించి చోరీలు చేశారు. ప్రొద్దుటూరుకు చెందిన ముగ్గురు సభ్యుల గల ముఠా ఈ చోరీలకు పాల్పడిందని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. వివరాలు.. పట్టణంలోని కరెంటాఫీస్ వెనుక వీధిలో ఉన్న సురే మాలకొండారెడ్డి నివాసంలో 37 సవర్ల బంగారం, రూ.40 వేలు.. వెంగళరావునగర్‌లో ఊడల ప్రతాప్ ఇంట్లో 650 గ్రాముల వెండి, ఒక సవరు బంగారం.. జనతాపేటలో అంతోట శోభన్‌బాబు నివాసంలో తొమ్మిది సవర్ల బంగారాన్ని చోరీ చేశారు. ఇందిరా నగర్‌లో అద్దూరి లలిత నివాసంలో చోరీకి పాల్పడగా, విలువైన వస్తువులు అపహరణకు గురికాలేదని బాధితురాలు చెప్పారు. ప్రొద్దుటూరుకు చెందిన ముగ్గురు సభ్యులతో కూడిన దొంగల ముఠా కారులో పట్టణానికి చేరుకొని తాళాలను తొలగించి ఇళ్లలోకి ప్రవేశించారు. చోరీ అనంతరం అదే కారులో వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న జిల్లా పోలీస్ అధికారులు అప్రమత్తమై అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా ప్రొద్దుటూరు దొంగల ముఠా కోసం కొంత కాలంగా ప్రకాశం జిల్లా పోలీసులు వెతుకులాటలో ఉన్నారు. జిల్లా పోలీసుల నుంచి సమాచారం అందుకున్న వారు అప్రమత్తమై ప్రొద్దుటూరు పోలీసులను అలర్ట్ చేశారు. దీంతో ముఠా సభ్యుల్లో ఒకర్ని వారు అదుపులోకి తీసుకున్నారని సమాచారం. చోరీ బాధితుల్లో ముగ్గురు ఉపాధ్యాయులు కాగా, ఒకరు రైతు. కావలి డీఎస్పీ శ్రీధర్, వన్ టౌన్ సీఐ ఫిరోజ్ బాధితులతో మాట్లాడి వివరాలను సేకరించారు. వేలిముద్రలను క్లూస్‌టీమ్ సేకరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పరిశీలిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

అత్యాధునిక పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారీ



బీమా బాండ్ అందజేస్తున్న బాబ్ జాన్, పవన్

కావలి: అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారవుతుందని సేల్స్ ఆఫీసర్ (మార్కెటింగ్) బాబ్ జాన్ తెలిపారు. అల్లూరు మండలం ఇస్కపల్లి గ్రామంలో లక్ష్మి ఏజెన్సీ సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కట్టడాలు పూర్తి నాణ్యతతో దీర్ఘకాలం ఉండేందుకు భారతి సిమెంట్ దోహదపడుతుందని చెప్పారు. ఈ సిమెంట్‌తో వేసిన శ్లాబుల్ని ఏడు రోజుల అనంతరం తమ కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యత పరీక్షలు చేస్తారన్నారు. ఇందుకోసం డీలర్ ద్వారా తమకు సమాచారం అందించాలని కోరారు. మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున ఉచిత బీమా సదుపాయం కల్పించి బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో పవన్ ఆదిత్య హార్డ్‌వేర్ షాపు యాజమాని పవన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్


డిపో ఎదుట నేతలు, కార్మికులు

రాపూరు: 'ఆర్టీసీలో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి. పాత వైద్య విధానాన్ని అమలు చేయాలి' అని ఎన్ఎంయూఏ జోనల్ కార్యదర్శి లుక్సన్ డిమాండ్ చేశారు. రాపూరు ఆర్టీసీ డిపో వద్ద గురువారం ర్యాలీ, గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. పదోన్నతులు కల్పించాలన్నారు. నైటవుట్ అలవెన్స్ రూ.400 ఇవ్వాలని, గ్యారేజ్‌లో సరైన స్పేర్‌పార్టులు అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి రమణయ్య, గ్యారేజ్ కార్యదర్శి సుధాకర్, అధ్యక్షుడు హరిబాబు, సీసీఎస్ డెలిగేట్ నిస్సార్ అహ్మద్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): భారత ప్రభుత్వం గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా అందజేసే పద్మ - 2026 అవార్డుల కోసం క్రీడాకారులు, క్రీడా ప్రోత్సాహకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి యతిరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు www.padmaawards.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచిన మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను నింపి వర్డ్, పీడీఎఫ్‌లను ఫార్మాట్లలో sportsinap@gmail.com, incentives.schemes@gmail.comకు మే 26వ తేదీలోగా ఈమెయిల్ పంపాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

అధికారులతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్


కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

నెల్లూరు రూరల్: రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ వివిధ అంశాలపై గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్ నుంచి జేసీ కె.కార్తీక్ ఇతర అధికారులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సీఎస్ ఆదేశించారు. ప్రభుత్వ వైద్యశాలలను తనిఖీలు చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ ఎస్ఈలు వెంకటరమణ, విజయన్, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు దాటుతుండగా..

- బొలెరో ఢీకొని వ్యక్తి మృతి

మర్రిపాడు: మండలంలోని బాట సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లిపోగు చెన్నయ్య (55) అనే వ్యక్తి మృతిచెందాడు. గురువారం పోలీసులు వివరాలు వెల్లడించారు. చెన్నయ్య రోడ్డు దాటుతుండగా బొలెరో వేగంగా వెళ్తూ ఢీకొట్టింది. దీంతో అతను చనిపోయాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై శ్రీనివాసరావు వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని బ్రాహ్మణపల్లి టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

క్షణికావేశంలో..

- గంటల వ్యవధిలో వేర్వేరు చోట్ల ఇద్దరి దారుణ హత్య
- భీతిల్లుతుతున్న నగర వాసులు
- మత్తులోనే నేరాలు


సుల్తాన్ మృతదేహం


అల్లాబక్షు మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో గంటల వ్యవధిలోనే రెండు హత్యలు జరిగాయి. క్షణికావేశంలో ఇద్దరు దారుణ హత్యకు గురయ్యారు. ఆరురోజుల వ్యవధిలో నగరంలో మూడు హత్యలు చోటుచేసుకోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని నగర వాసులు భీతిల్లుతున్నారు. పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి నేరాల కట్టడికి కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

కత్తిపోటుకు గురై..

వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోని అయ్యప్పగుడి వద్ద బుధవారం రాత్రి కత్తిపోటుకు గురైన అల్లాబక్షు అనే వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. వేదాయపాళెంలోని పావని ఎస్టేట్ అపార్ట్‌మెంట్‌లో షేక్ అల్లాబక్షు (40), సుభహాని దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి నాయబ్ రసూల్, సమీర్‌లు సంతానం. అల్లాభక్షు అయ్యప్పగుడి ఫ్లైఓవర్ సమీపంలో టెంపో ట్రావెల్స్ నిర్వహిస్తున్నాడు. ఆయన బుధవారం సాయంత్రం ట్రావెల్స్ వద్దకు వెళ్తానని భార్యకు చెప్పి ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. రాత్రి 9.10 గంటల ప్రాంతంలో భార్యకు ఫోన్ చేసి పిల్లలకు పరోటా, ఇడ్లీ తీసుకొస్తానన్నాడు. అయ్యప్పగుడి సమీపంలోని భగవాన్ టిఫిన్ సెంటర్‌కు వెళ్లాడు. అక్కడ ఉండగా రంగనాయకులపేటకు చెందిన షేక్ ఇషాక్ వచ్చాడు. మత్తులో ఉన్న ఆ యువకుడు మొదట టిఫిన్ తనకు ఇవ్వాలని పట్టుబట్టాడు. ఈ విషయంలో అల్లాభక్షు, ఇషాక్ నడుమ వివాదం చెలరేగింది. అక్కడున్న వారు వారిస్తున్నా పట్టించుకోని ఇషాక్ తన వద్దనున్న కత్తితో అల్లాబక్షు ఛాతిపై బలంగా పొడిచాడు. స్థానికులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. తీవ్రగాయాలపాలైన అల్లాబక్షును బావమరిది రఫీ, స్థానికులు చికిత్స నిమిత్తం నగరంలోని కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్యులు చికిత్స చేస్తుండగానే మృతిచెందాడు. రఫీ ఈ విషయాన్ని తన సోదరి (మృతుడి భార్య)కు తెలియజేశాడు. ఆమె ఆస్పత్రికి చేరుకుని భర్త మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసులురెడ్డి కేసు నమోదు చేశారు. నగర ఇన్‌చార్జి డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి కిమ్స్‌కు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. జీజీహెచ్‌లో గురువారం ప్రభుత్వ వైద్యులు మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల అదుపులో ఉన్న ఇషాక్ ఇంటీరియర్ పనులు చేస్తుంటాడు. అతడి వద్ద కత్తి ఎందుకు ఉందన్న విషయాన్ని పోలీసులు ఆరా తీస్తున్నారు.

పాతకక్షలే కారణమా?

మద్యం మత్తులో మాటామాటా పెరిగి సుల్తాన్ హత్య జరిగిందని పోలీసులు చెబుతున్నా పాతకక్షలే కారణమనే ప్రచారం ఉంది. పోలీసుల కథనం మేరకు.. జాకీర్‌హుస్సేన్ నగర్‌కు చెందిన షేక్ సుల్తాన్ (38), షమీమాలు దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. అతను బేల్దారి పనులు చేస్తుంటాడు. సుల్తాన్‌పై గతంలో హత్యాయత్నం కేసు ఉంది. అతను బుధవారం రాత్రి బహిర్భూమికి పెన్నానది వద్దకు వెళ్లాడు. అప్పటికే అక్కడ మైపాడు గేటు రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన పెయింటర్ నాగరాజు, జాకీర్‌హుస్సేన్ నగర్‌కు చెందిన షేక్ ఖలీమ్‌లు మద్యం తాగుతున్నారు. వారి మధ్య మాటామాటా పెరిగింది. దీంతో ఆగ్రహానికి లోనైన నాగరాజు, ఖలీమ్‌లు కర్రలతో విచక్షణారహితంగా సుల్తాన్ తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం నిందితులు నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిసింది. మృతుడి తల్లి కరిమున్నీసా ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్‌బాషా కేసు నమోదు చేశారు. జీజీహెచ్‌లో గురువారం ప్రభుత్వ వైద్యులు మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గతనెల చివరిలో సుల్తాన్ నిందితుల్లో ఒకరితో గొడవపడ్డాడని, ఈ నేపథ్యంలో హత్య జరిగినట్లు ప్రచారం ఉంది.

అందువల్లే..

నెల్లూరు నగరంలో పగలు, రాత్రి అనే తేడాలేకుండా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గంజాయి సైతం విరివిగా అందుబాటులో ఉంది. అసాంఘిక శక్తులు, అల్లరిమూకలు మత్తులో వీరంగాలు చేస్తున్నారు. ఇటీవల జరిగిన నేరాలన్నీ దాదాపు మత్తులోనే జరిగాయి. మత్తు పదార్థాలను కట్టడి చేయాల్సిన ఎక్సైజ్, పోలీసు అధికారులు లోపాయికారి ఒప్పందాలతో నామమాత్రపు చర్యలకే పరిమితమయ్యారన్న విమర్శలున్నాయి.

నా మాటంటే విలువ లేదా?

- దివ్యాంగుడికి ట్రై సైకిల్ ఇచ్చి తీసేసుకుంటారా
- ఫొటోకు ఫోజులివ్వడానికేనా
- సమగ్ర శిక్ష అధికారులపై జెడ్పీ చైర్‌పర్సన్ అసహనం


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(పొగతోట): 'ఓ దివ్యాంగుడికి ట్రై సైకిల్ ఇవ్వాలని సమగ్ర శిక్ష జిల్లా అధికారులకు చెప్పాను. వాళ్లు దానిని అందించి ఫొటోలు తీసుకున్నారు. మళ్లీ ఆ సైకిల్‌ను వెనక్కు తీసేసుకున్నారు. అధికారులకు నా మాటంటే విలువ లేదా?, ఆ మాత్రానికి ఇస్తామని చెప్పడం ఎందుకు?, అవమానించడం ఎందుకు?' అని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అసహనం వ్యక్తం చేశారు. గురువారం నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. ఇందులో అరుణమ్మ మాట్లాడారు. అధికారులు ట్రై సైకిల్ ఇచ్చి ఫొటోలకు ఫోజులిచ్చి అనంతరం దానిని తిరిగి తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. చైర్‌పర్సన్ ఇచ్చిన మాటకే విలువ లేకుంటే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు సమావేశాలకు రావడం, పేపర్లలో ఉన్నది చదివి వినిపించి వెళ్లిపోవడం జరుగుతోందన్నారు. మా మాటలకు విలువలేని దానికి సమావేశాలు నిర్వహించడం ఎందుకంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తోటపల్లి గూడూరు మండలంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాలను త్వరగా కూల్చేయాలని ఆదేశించారు. ఐసీడీఎస్‌కు సంబంధించి అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.


నిర్మాణాలు పూర్తి చేయాలి

వివిధ మండలాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులు సచివాలయ, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ఉపాధి హామీకి సంబంధించి రెండు నెలలకు పైగా పనులు చేసిన కూలీలకు వేతనాలు అందలేదన్నారు. చైర్‌పర్సన్ స్పందిస్తూ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఉపాధి కూలీలకు వేతనాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవి నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా మంచినీటిని సరఫరా చేయాలన్నారు. వాటర్ ట్యాంక్‌లను సకాలంలో శుభ్రం చేస్తూ నీటిని విడుదల చేయాలని తెలిపారు. పొదుపు గ్రూపు మహిళలకు సకాలంలో రుణాలు అందించి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. అర్హులైన వృద్ధులు, ఒంటరి మహిళలకు పింఛన్లు మంజూరు చేయాలన్నారు. పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి రుణాలు అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ విద్యారమ, వివిధ శాఖల అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 119
లేయర్ (లైవ్) : 100
బ్రాయిలర్ చికెన్ : 214
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 236
లేయర్ చికెన్ : 170

నిమ్మ ధరలు (కిలో)


పెద్దవి : రూ.100
సన్నవి : రూ.80
పండ్లు : రూ.50

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్


ఐఐటీ డైరెక్టర్ డా.కెఎన్ సత్యనారాయణ, అధ్యాపక బృందంతో 16వ ఆర్థిక సంఘం చైర్మన్

ఏర్పేడు(రేణిగుంట): 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారే అవకాశం ఉందని 16వ ఆర్థిక సంఘం చైర్మన్, తొలి నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ డా.అరవింద్ పనగారియా అన్నారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీని ఆయన గురువారం సందర్శించారు. 'భారతదేశం గ్లోబల్ ఎకానమీలో తదుపరి దశాబ్దం' అనే అంశంపై ఆయన ఐఐటీ హ్యూమానిటీస్ - సోషల్ సైన్సెస్ విభాగం నిర్వహించిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఆయనకు ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ స్వాగతం పలికి 3వ జనరేషన్ ఐఐటీగా తిరుపతి ఐఐటీ ప్రస్థానం గురించి, పదేళ్లలో సాధించిన ప్రగతిని గురించి ఆయనకు వివరించారు. 16వ ఆర్థిక సంఘం సభ్యులు, ఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మనోజ్ పాండా, ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఈ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ప్రొఫెసర్ అరవింద్ పనగరియా మాట్లాడుతూ రెండు దశాబ్దాల్లో భారత్ ఎన్నో సంక్షోభాలను అధిగమించి 8 - 9 శాతం వృద్ధి రేటు సాధించినట్టు వెల్లడించారు. అటల్ సేతు, కొత్త పార్లమెంట్ భవనం వంటి ప్రాజెక్టులు దేశ సామర్థ్యాన్ని చూపిస్తున్నాయన్నారు. రాబోయే దశాబ్దంలో భారతదేశం 9 - 10 ట్రిలియన్ ఎకానమీగా మారే అవకాశం ఉందని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ మాట్లాడుతూ తిరుపతి ఐఐటీలో జరుగుతున్న మార్పులు, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా రూపుదిద్దుకున్న మూడో తరం ఐఐటీ పురోగతిని వివరించారు. విద్యార్థుల్లో మూడో వంతు మంది పీహెచ్‌డీ ప్రోగ్రాంలలో ఉన్నారని, అధ్యాపకులు 200కి పైగా పరిశోధన ప్రాజెక్టుల్లో పాల్గొంటున్నారని తెలిపారు.

ముగ్గురు ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సస్పెన్షన్?

పొదలకూరు: మండలంలోని ముగ్గురు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. గతంలో ఇక్కడ పనిచేసిన హౌసింగ్ ఏఈ శివమోహన్‌ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీనికి కొనసాగింపుగా హౌసింగ్ బిల్లులు చేసిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ముగ్గురిని ఉన్నత స్థాయి అధికారులు సస్పెండ్ చేసినట్లుగా తెలుస్తోంది. అయితే అధికారంగా ఇప్పటి వరకు ఉత్తర్వులు తమకు అందలేదని ఎంపీడీఓ నరసింహారావు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృత్యువాత

తోటపల్లిగూడూరు: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతిచెందిన ఘటన గురువారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం అల్లీపురం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణకు కోడూరులో రొయ్యల గుంతలున్నాయి. అల్లీపురం గ్రామానికే చెందిన పోలయ్య - చెంచమ్మ (35) అనే గిరిజన దంపతులు ఆ గుంతల వద్ద కాపలాదారులుగా ఉన్నారు. బుధవారం సాయంత్రం చెంచమ్మ రొయ్యల గుంతలో మేత వేస్తుండగా విద్యుత్ తీగలు కాలికి తగలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న లక్ష్మీనారాయణ పోలీసులకు సమాచారం ఇవ్వకుండా చెంచమ్మ బంధువులతో మాట్లాడి అర్ధరాత్రి మృతదేహాన్ని అల్లీపురానికి తరలించేశాడు. బంధువులు గురువారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనపై తమకు సమాచారం లేదని స్థానిక పోలీసులు వెల్లడించారు.

కేసులు ఎత్తేయాలని ధర్నా


ధర్నా చేస్తున్న దళితులు, రైతు కూలీ సంఘం సభ్యులు

సైదాపురం: ఊటుకూరు దళితులపై మైనింగ్ మాఫియా పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, దళితుల భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. ఆయన గురువారం దళితులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఊటుకూరు సమీపంలో సర్వే నంబర్ 359, 356లో ఉన్న ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలని కోరారు. అలాగే భూస్వాములు, పెత్తందారుల ఆక్రమణలో ఉన్న బంజరు, మిగులు, పోరంబోకు భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులపై పెట్టిన కేసులు ఎత్తి వేసేంత వరకు ఆందోళనలు విరమించేది లేదని హెచ్చరించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రమేష్, వెంకటయ్య, మమత, కోటయ్య, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

జోరు.. హు'షారు'

- షార్‌లో ఒకేసారి నాలుగు రాకెట్ల అనుసంధానం


మొదటి ప్రయోగ వేదికపై పీఎస్ఎల్వీ రాకెట్ (ఫైల్)

సూళ్లూరుపేట: ఆకాశమే హద్దుగా వరుస విజయాలతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) దూసుకుపోతోంది. తాజాగా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లో కొద్ది రోజుల నుంచి ఒకేసారి నాలుగు రాకెట్ల అనుసంధానం పనులను ప్రారంభించింది. ఇస్రో అంతరిక్ష ప్రయోగాల ప్రయాణంలో ఇదో మైలురాయిగా నిలుస్తోంది. షార్‌లోని మొదటి ప్రయోగ వేదికకు అనుసంధానంగా ఉన్న పీఎస్ఎల్వీ ఇంటిగ్రేటెడ్ ఫెసిలిటీ భవనం (పీఫ్)లో పీఎస్ఎల్వీ సీ-61 రాకెట్ అనుసంధానం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ రాకెట్ ద్వారా ఈఓఎస్ - 09 అనే ఉపగ్రహంతోపాటు వాణిజ్యపరంగా మరో రెండు ఉపగ్రహాలను పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండో ప్రయోగ వేదికకు అనుసంధానంగా ఉన్న మొదటి వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో జీఎస్ఎల్వీ ఎఫ్-16 రాకెట్ అనుసంధానం పనులు చేపట్టారు. ఈ రాకెట్ ద్వారా నాసా - ఇస్రో రూపొందిస్తున్న నాసా - ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్ శాటిలైట్ (నిసార్) అనే ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. సాలిడ్ స్టేజ్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (ఎస్ఎస్ఏబీ)లో ఎల్వీఎం3 - ఎం5 రాకెట్ అనుసంధానం పనులు జరుగుతున్నాయి. ఈ రాకెట్ ద్వారా వన్‌వెబ్ ఇండియా - 3 అనే ఉపగ్రహాలను ప్రయోగించనున్నారు. రెండో అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో గగన్‌యాన్ - 1 ప్రయోగానికి సంబంధించి ఎల్వీఎం3 - జీ1 అనే రాకెట్ అనుసంధానం పనులు కూడా చేస్తున్నారు.

ఏం కష్టం వచ్చిందో..

- పురుగు మందు తాగిన వృద్ధ దంపతులు
- చికిత్స పొందుతూ భర్త మృతి
- భార్య పరిస్థితి విషమం

వెంకటాచలం: పురుగు మందు తాగిన భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందగా, భార్య పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన వెంకటాచలం మండలం కనుపూరు గ్రామంలో గురువారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. రాయపనేని రమణయ్య (75), సుబ్బమ్మ (65) కనుపూరులో నివాసం ఉంటున్నారు. వారి కుమారుడు శేషయ్య బుజబుజనెల్లూరు సమీపంలో ఉంటున్నాడు. ఏం కష్టం వచ్చిందో గానీ వృద్ధ దంపతులు గురువారం తమ నివాసంలో ఉన్న పురుగు మందు తాగారు. రమణయ్య, సుబ్బమ్మ బయటకు రాకపోవడంతో చుట్టుపక్కల వారికి అనుమానం వచ్చి తలుపు తట్టారు. స్పందన లేకపోవడంతో తలుపులు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి అపస్మారకస్థితిలో ఉన్న దంపతులను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రమణయ్య మృతిచెందాడు. సుబ్బమ్మ పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు జడ్జి నియామకం

నెల్లూరు(లీగల్): 8వ అదనపు జిల్లా (మహిళ) కోర్టు జడ్జి జి.గీతను నెల్లూరు మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జిగా నియమిస్తూ ఏపీ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 8వ అదనపు జిల్లా (మహిళ) కోర్టు జడ్జిగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి ఎంఏ సోమశేఖర్ నియమితులయ్యారు.

కండలేరులో 46.226 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 46.226 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు.